దసరా వేళ ధరల దరువు

- సామాన్యుల అవస్థలు
- అప్పులు చేసి మరీ కొనుగోళ్లు


డివైడర్‌పై దిష్టి యంత్రాలు, పండ్ల అమ్మకాలు


కిక్కిరిసిన మార్కెట్


రహదారిపై అలంకరణ సామగ్రి విక్రయాలు

తగరపువలస: విజయదశమి వేళ ధరల దరువుతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. అసలే ఇసుక సరఫరా లేక పనులు నిలిచిపోవడంతో సమాజంలో 80 శాతం పైగా ఉండే భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, వెల్డర్లు, పెయింటర్లు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, కుమ్మర్లు, శానిటరీ తదితర వర్గాల ప్రజలు వందరోజులకు పైగా కష్టాలు పడుతున్నారు. అయినప్పటికీ పండగ వేళ తప్పదనుకుంటూ అప్పులు చేసి మరీ జరుపుకొంటున్నారు. దీంతో వినియోగదారులతో మార్కెట్ కిటకిటలాడింది.

అన్ని వస్తువులదీ అదే బాట..

కూరగాయల నుంచి పూజా సామగ్రి వరకు వస్తువుల ధరలన్నీ చుక్కలను తాకుతున్నాయి. కూరగాయల ధరలు కిలో రూ.50కు తక్కువ కాకుండా ఉన్నాయి. దసరా ఆయుధపూజకు వినియోగించే ఏ వస్తువు కూడా రూ.20కు తక్కువ లభించడం లేదు. కొబ్బరికాయల ధరలు రూ.50కు చేరుకున్నాయి. వాహనాలు, యంత్రాల అలంకరణ సామగ్రి, రంగులు, దిష్టి యంత్రాలు, పువ్వులు, అరటి, మామిడి ఆకులు, పండ్లు, నిమ్మకాయలు, అమ్మవారి చిత్రపటాలు కూడా రూ.100 నుంచి రూ.300కు దొరుకుతున్నాయి. స్వీట్లు, నాటుకోళ్లు, గృహోపకరణ వస్తువులు, ద్విచక్రవాహనాలు, బంగారు ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేయలేక సతమతమవుతున్నారు. డీవీస్, రైల్వే వంటి కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు తమ ఉద్యోగులకు ఇచ్చే బోనస్ కొన్ని వర్గాలకే ఊరట కలిగిస్తుంది. ఇక డిజిటల్ మార్కెటింగ్ ఊపందుకోవడంతో ప్రస్తుతం వినియోగదారులలో చాలావరకు ఆన్‌లైన్‌లోనే షాపింగ్ చేసేస్తున్నారు.


రద్దీగా ఉన్న వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్

వేములవలస మార్కెట్‌కు దసరాశోభ

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్‌కు శుక్రవారం దసరా శోభ వచ్చింది. భీమిలి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన వ్యాపారులు, వినియోగదారులతో కిటకిటలాడింది. పువ్వులు, పండ్లు, పూజా సామగ్రి, అలంకరణ వస్తువులతో మార్కెట్ నిండిపోవడంతో జాతీయరహదారిపై కూడా విక్రయాలు జరిపి, వాహనాలను నిలిపివేశారు. నియోజకవర్గంలో మిగిలిన మార్కెట్‌లతో పోలిస్తే వేములవలసలో హోల్‌సేల్ వ్యాపారులు ఎక్కువగా ఉండటంతో కిక్కిరిసిపోయింది. అయినప్పటికీ దసరా పండగ సందర్భంగా ఇక్కడ కూడా వస్తువుల ధరలకు అమాంతం రెక్కలు వచ్చాయి.


పూజా సామగ్రి విక్రయాలు

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామాగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

తీరంలో షూటింగ్ సందడి


లొకేషన్‌లో కృష్ణుడు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ఎర్రమట్టి దిబ్బల సమీపంలో షూటింగ్ సందడి నెలకొంది. హీరో నాగశౌర్య, నటుడు కృష్ణుడిపై పలు సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు. ఈ సినిమాకు పేరు ఇంకా ఖరారు కాలేదని, మరో వారం రోజుల పాటు షూటింగ్ ఈ ప్రాంతాల్లో ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి


అవగాహన కల్పిస్తున్న సూరిబాబు

కొమ్మాది: ప్రతి ఒక్కరు వారంలో ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ ఎస్.సూరిబాబు సూచించారు. 4వ వార్డు పరదేశిపాలెంలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తడి చెత్త పొడిచెత్త వేరువేరుగా నిల్వ చేసుకోవాలని తెలిపారు.

దివ్యాంగుల ఐటీఐ విద్యార్థి అదృశ్యం


అవినాష్ (ఫైల్)

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని బక్కన్నపాలెం ప్రభుత్వ దివ్యాంగుల ఐటీఐలో చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పీఎం పాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ బ్లాకు నంబర్-11, ఎఫ్ఎఫ్-8 లో నివసిస్తున్న నరవ అవినాష్ (20) బక్కన్నపాలెం దివ్యాంగుల ఐటీఐలో చదువుతున్నాడు. మానసిక వికలాంగుడైన అవినాష్ ఈ నెల 9న కాలేజీకని చెప్పి వెళ్లి, తర్వాత ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో అవినాష్ తల్లి గిరిజాకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: దసరా సంబరాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన జ్యోస్ డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యంతో ఆకట్టుకున్నారు. సీహెచ్ మురళీ గోవింద్ నృత్య దర్శకత్వంలో కళాకారులు మోహన లక్ష్మి, ఆశాలత, తహస్విత సాయి, చిన్మయి రోషిత తదితరులు పాల్గొన్నారు.



భీమిలి బీచ్ రోడ్డులోని నోవోటెల్ బీచ్ రిసార్ట్ (ఇన్‌సెట్) తుపాను ధాటికి ఛిద్రమైన ఇలా..



బోయివీధి ప్రాంతంలో ప్రస్తుతం ఉన్నరోడ్డు (ఇన్‌సెట్) అప్పట్లో కోతకు గురైన రోడ్డు



తుపాను అనంతరం మరమ్మతులు చేసిన పార్కు (ఇన్‌సెట్) తుపానుకు సగం వరకు కొట్టుకు పోయిన పార్కు

హుద్‌హుద్ గాయానికి పదేళ్లు

2014, అక్టోబర్ 12.. తీవ్ర తుపాను రూపంలో హుద్‌హుద్ విశాఖను చిగురుటాకులా వణికించిన రోజు. ఆ గాయానికి నేటికి సరిగ్గా పదేళ్లు. కానీ ఆ రోజు తలచుకుంటే తుపాను బీభత్సం ఇప్పటికీ కనులముందు కదలాడుతూనే ఉంటుంది. సుమారు 150 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు వేలాది చెట్లు నేలకు ఒరిగాయి. పూరిళ్ల పైకప్పులు, సిమెంట్ రేకులు ఎగిరిపోయాయి. ముఖ్యంగా బీచ్‌రోడ్డు తీవ్ర కోతకు గురైంది. భీమిలిలోని బోయివీధి ప్రాంతం, బీచ్ పార్కు అలల తాకిడికి సగం వరకు కోరుకుపోయాయి. ఊహించలేనంత నష్టం వాటిల్లింది. అయితే, విశాఖవాసుల సమష్టి కృషితో నగరం కొద్ది నెలల్లోనే కాస్త కోలుకోగలిగింది. కోల్పోయిన పచ్చదనాన్ని పునరుద్ధరించేందుకు, విశాఖకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు వచ్చిన స్వచ్ఛంద సేవకుల సహకారంతో పునరుజ్జీవం పొందింది.

- భీమునిపట్నం

సకల శుభకారిణి .. సర్వలోక రక్షిణి

- మహిషాసుర మర్దనిగా అమ్మవారి దర్శనం
- భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు
- వేడుకగా శరన్నవరాత్రి మహోత్సవాలు


మధురవాడ విజయదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి


గాజుల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి


నెమలికన్నుల అలంకరణలో తాటితూరు పైడితల్లమ్మ


మహిషాసుర మర్దనిగా చంద్రంపాలెం దుర్గాలమ్మ


బాలాజీనగర్‌లో అమ్మవారికి సారె ఊరేగింపు

తగరపువలస: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసుర మర్దనిగా దర్శనమిచ్చారు. పలు మండపాలు, ఆలయాలకు మహిళలు ఊరేగింపుగా వెళ్లి పిండివంటలు, పండ్లు, స్వీట్లతో సారె సమర్పించారు. బాలాజీనగర్‌లో గురుభవాని జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు.

- తాటితూరులో పైడితల్లమ్మను నెమలి కన్నులతో, సంతపేట కొత్తమ్మతల్లిని గాజులతో అలంకరించారు.
- సంగివలస పోలమాంబ అమ్మవారిని ఈవో టి. రాజగోపాలరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.
- కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద చండీహోమం ముగింపు సందర్భంగా పండితులు పూర్ణాహుతి సమర్పించారు.
- కీతిన్‌పేట శ్రీవిద్యాపీఠంలో సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యంగిరా హోమం నిర్వహించారు.


సంగివలస పోలమాంబ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఈవో రాజగోపాలరెడ్డి తదితరులు


ఎండాడ దుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు


భజన చెట్టుకు పూజలు చేస్తున్న సభ్యులు

కొమ్మాది: ఎండాడలోని ఎంకె గోల్డ్ అపార్ట్‌మెంట్స్‌లో ఎంకె గోల్డ్ కాస్ట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భజన చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో మేయర్ పూజలు

మధురవాడ: మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయదుర్గ ఆలయంలో నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాస్ దంపతులు పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదం వడ్డించారు. మధురవాడ పీఎన్‌బీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పోతిన నగేష్ దంపతులు పూజలు నిర్వహించారు.

- దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దనిగా దర్శనమిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం నాయకులు పిల్లా పాపారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కొమ్మాది: ఎండాడలోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దనిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

పీఎం పాలెం: కారు షెడ్ దరి బబ్బేలమ్మ మహిషాసుర మర్దనిగా దర్శనమిచ్చారు.

అమ్మవారి సన్నిధిలో నారాయణ సేవ

తగరపువలస: దసరా వేడుకల్లో భాగంగా శుక్రవారం పలుచోట్ల ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్న సమారాధనలు నిర్వహించారు. రెండోవార్డు సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీలో గురుభవాని జి.లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో జరిగిన నారాయణసేవను పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ప్రారంభించారు. జీరుపేట వద్ద మండపంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. చిట్టివలస రైతుబజారును ఆనుకుని మండపం వద్ద జరిగిన అన్న సమారాధనలో భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు, నాయకులు డబ్బీరు ప్రశాంతి, చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, కొప్పల రమేష్, కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అన్న సమారాధనను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

బబ్బేలమ్మ ఆలయంలో..

పీఎం పాలెం: బబ్బేలమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మంది పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, సూర్యారావు, బాలాజీ, నాయుడు తదితరులు పాల్గొన్నారు. పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో గాయత్రీనగర్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో అన్న సమారాధన నిర్వహించారు. జామి శివ కుమార్ పాల్గొన్నారు.


బబ్బేలమ్మ ఆలయం వద్ద..

మధురవాడ: చంద్రంపాలెం పూర్వ గుడి దుర్గాలమ్మ ఆలయంలో సుమారు 5వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు, ధర్మకర్త పిల్లా పాపారావు దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

‘రావణ వధ’ నేడు

హరేకృష్ణ వైకుంఠ మందిరంలో ఏర్పాట్లు


20 అడుగుల ప్రత్యేక పేలుడు బాణసంచాతో తయారు చేసిన రావణాసురుని చిత్రం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో శనివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు నిర్వహించనున్నట్టు అంబరీష దాస తెలిపారు. మొదటిసారిగా తమ సంస్థ దసరా వేడుకలలో భాగంగా ప్రత్యేక పేలుడు బాణసంచాతో తయారు చేసిన 20 అడుగుల ఎత్తుగల దశానన రావణాసురుని చిత్రాన్ని రూపొందించినట్టు తెలిపారు. త్రేతాయుగంలో విజయదశమి నాడు రావణాసురునిపై శ్రీరామచంద్రుని విజయానికి సంకేతంగా ఉత్తరాది రాష్ట్రాలలో ఈ ఉత్సవాలను జరుపుతారన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ అష్టోత్తర హోమం, శ్రీరామలీలా ప్రవచనం, మహా మంగళ హారతి, రావణ వధ, తీర్థ ప్రసాదాల వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఇండియన్ స్టూడెంట్ హాస్టల్స్ ట్రస్ట్ సభ్యురాలిగా జెట్సీ

బీచ్‌రోడ్డు: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లండన్‌లో వందేళ్లుగా నిర్వహిస్తున్న ఇండియన్ స్టూడెంట్ హాస్టల్స్ ట్రస్ట్ సభ్యురాలిగా నగరానికి చెందిన జెట్సీ మిరలిన విలియమ్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముంబయిలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆమెను ట్రస్ట్ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ వైఎంసీఏ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఆమెను విశాఖపట్నం వైఎంసీఏ అధ్యక్షుడు కృపాదన్ కుమార్, సభ్యులు అభినందించారు.